ప్రజాశక్తి
శనివారం 2 మార్చి 2024
5
అల్లూరి సీతారామరాజు

ల్యాప్‌టాప్‌ల పంపిణీ

ప్రజాశక్తి-పాడేరు: సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ లో శుక్రవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో నలుగురు దివ్యాంగ విద్యార్థులకు లాప్‌టాప్‌లను జాయింట్ కలెక్టర్ భావన వశిష్ట్, ఐటిడిఎ ప్రాజెక్ట్ అధికారి అభిషేక్ పంపిణీ చేశారు. డిప్లొమా, డిగ్రీ, పి.జి, ఇంజనీరింగ్, పొఫెషనల్ కోర్సులు చదువుచున్న దివ్యాంగ విద్యార్థులు (శారీరక,అంధ, బధిర, మానసిక) లాప్ టాప్‌లకు దరఖాస్తు చేసుకొనవచ్చునని విభిన్న ప్రతిభావంతులు, వయోవృద్ధుల సహాయ సంస్థ సహాయ సంచాలకులు మాధవి తెలిపారు. అభ్యర్థులు ధృవ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ, తెల్ల రేషన్ కార్డు, సదరం సర్టిఫికేట్, కళాశాల బోనఫైడ్ సర్టిఫికేట్ తదితర వాటిని జత పరచాలని తెలిపారు.మరిన్ని వివరాలకు ఫోన్: 9441568462ను సంప్రదించ వలెను కోరారు.

ల్యాప్‌టాప్‌ను ఇస్తున్న పిఒ, జెసి

తొలిరోజు సజావుగా ఇంటర్ పరీక్షలు

568 మంది విద్యార్థులు గైర్హాజరు

పాడేరులో పరీక్షలకు హాజరైన విద్యార్థులు

ప్రజాశక్తి-పాడేరు: అల్లూరి జిల్లాలో ఇంటర్మీడియట్ పరీక్షలు తొలి రోజు శుక్రవారం ప్రశాంతంగా జరిగాయి.. పాడేరు, రంపచోడవరం డివిజన్లోని 22 మండల కేంద్రాలతో పాటు మరికొన్ని చోట్ల అదనంగా ఏర్పాటు చేసిన మొత్తం 27 పరీక్షా కేంద్రాల్లో పకడ్బందీ ఏర్పాట్ల మధ్య ఇంటర్ పరీక్షలు సజావుగా మొదలయ్యాయి. జిల్లాలో మొత్తం 7759 మంది విద్యార్థులు ఇంటర్ పరీక్షలు రాయవలసి ఉండగా, హాజరైన వారు 7191 కాగా 568 మంది పరీక్షలకు గైర్హాజరయ్యారు. పరీక్షల్లో మాస్ కాపీయింగ్ నరికట్టేందుకు సీసీ కెమెరాలు నిఘాతో పాటు సిట్టింగ్ స్క్వాడ్ ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేయడంతో పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. జిల్లా పరిధిలో మొదటి రోజు ఇంటర్ పరీక్షల్లో ఎటువంటి డిబార్ వంటి ఘటనలు జరగలేదని ఇంటర్ పరీక్షల జిల్లా ప్రత్యేక అధికారి ఎం.వినోద్ బాబు స్పష్టం చేశారు.

డుంబ్రిగుడ: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం ప్రారంభమైన ఇంటర్మీడియట్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. పరీక్ష కేంద్రం చుట్టూ పోలీసుల పహారా మధ్య కట్టుదిట్టంగా జరిగింది. ఈ పరీక్ష కేంద్రాన్ని స్థానిక సీఐ రుద్ర శేఖర్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, పరీక్ష కేంద్రం ఆవరణలో 144 సెక్షన్ అమల్లో ఉందని, బయట వ్యక్తులు లోపలికి ప్రవేశించకూడదని హెచ్చరించారు. పరీక్ష కేంద్రంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా గట్టిగా పోలీసు బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయన వెంట స్థానిక ఎస్ఐ సంతోష్ కుమార్ ఉన్నారు.

ఇంటర్ పరీక్ష కేంద్రాన్ని పరిశీలించిన ఐటీడీఏ పిఒ

రంపచోడవరం : రంపచోడవరం గురుకుల కళాశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ హైస్కూల్లో ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే శుక్రవారం పరిశీలించారు. విద్యార్థులు పరీక్షలు బాగా రాసి మంచి మార్కులతో పాసైతే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు.

రాజవొమ్మంగి : స్థానిక గురుకుల కళాశాలలో శుక్రవారం జరిగిన ప్రథమ ఇంటర్ తెలుగు1 పరీక్షకు 13 మంది విద్యార్థులు గైరాజరయ్యారు. 305 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా 292 మంది హాజరైనట్లు డిపార్ట్మెంట్ అధికారి ఈశ్వర్ ప్రసాద్ తెలిపారు. ఒకేషనల్ పరీక్షకు 20 మందికి 20 మంది హాజరయ్యారు. ఇంటర్ పరీక్షా కేంద్రాలను రాజవొమ్మంగి సీఐ సన్యాసినాయుడు, సిబ్బంది పర్యవేక్షించారు. కార్యక్రమంలో డిటి ఏ.సత్యనారాయణ, ఎస్ఐ వెంకయ్య పాల్గొన్నారు.

సీలేరు : జీకే వీధి మండలం సీలేరులో ఇంటర్ పరీక్షా కేంద్రాన్ని జీకే వీధి సీఐ అశోక్ కుమార్ పరిశీలించారు. 144 అమల్లో ఉన్నందున పరీక్ష కేంద్రాన్ని చుట్టుపక్కల ఎవర్ని అనుమతించరాదని సిబ్బందికి ఆదేశించారు.

మారేడుమిల్లి : స్థానిక ఏపి రెసిడెన్సియల్ కళాశాలలో ఇంటర్ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఏపిఆర్ కళాశాల నుండి 171, ప్రభుత్వ జూనియర్ కళాశాల నుండి 100, కస్తూర్బా గాంధీ బాలికల కళాశాల నుండి 39 మంది మొత్తం 310మంది విద్యార్థులు హాజరైనట్లు ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

మాట్లాడుతున్న ఐటిడిఏ పిఒ సూరజ్ గనోరే

ఏజెన్సీ ఉత్పత్తులకు అధిక ధర వచ్చేలా చర్యలు

ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే

ప్రజాశక్తి-రంపచోడవరం

ఏజెన్సీలోని ఉత్పత్తులు తక్కువ ధరకు కొనుగోలు చేసి, మైదాన ప్రాంతంలో చాలా ఎక్కువ రేట్లకు అమ్మి అధిక లాభాలు పొందుతున్నారని, ఈ ఉత్పత్తులకు ఏజెన్సీలోనే ఎక్కువ ధర వచ్చే విధంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే ఆదేశించారు. తాటిచెట్లు, పనస పండులు, కర్ర పెండ్లం ద్వారా వివిధ రకాల ఆహార పదార్థాలు తయారీకి సంబంధించి మండలంలోని పందిరి మామిడి కృషి విజ్ఞాన కేంద్రంలో ఏడు మండలాలకు సంబంధించిన వ్యవసాయ, ఉద్యానవన మండల అధికారులు, ఆయా శాఖల సచివాలయ అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం జరిగింది. ఇందులో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఐటిడిఎ పిఒ మాట్లాడుతూ తాడిచెట్టు నుండి వచ్చే నీరా ఒక లీటర్ రూ.25కు కొనుగోలు చేయనున్నట్లు తెలిపారు. కృషి విజ్ఞాన కేంద్రం ప్రాంగణంలో నీరా ద్వారా తాటిబెల్లం కూడా తయారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఏజెన్సీలోని చదువుకున్న గిరిజన యువతీ యువకులకు చిన్న చిన్న యూనిట్లు ఏర్పాటు చేసుకునే విధంగా సబ్సిడీపై ఆర్థిక సాయం అందించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్ర కో-ఆర్డినేటర్ లలిత కామేశ్వరి, కెవికె సీనియర్ సైంటిస్టులు కె.రాజేంద్రప్రసాద్, పిసి వెంకయ్య, పిహెచ్ఓ కె.చిట్టిబాబు, ప్రాజెక్ట్ అగ్రికల్చరల్ అధికారి ఎల్.రాంబాబు, అగ్రికల్చరల్ అసిస్టెంట్ డైరెక్టర్ సిహెచ్‌కెవి.చౌదరి, యం.సావిత్రి పాల్గొన్నారు. అనంతరం నీరా, తాటి బెల్లం తయారు చేసే ప్లాంట్‌ను సందర్శించారు.

ఏకలవ్య మోడల్ స్కూళ్లలో ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

రంపచోడవరం, చింతూరు డివిజన్ల పరిధిలోని ఆరు ఏకలవ్య మోడల్ పాఠశాలల్లో 2024 -25 విద్యా సంవత్సరానికి సంబంధించి సిబిఎస్‌సి సిలబస్, ఇంగ్లీషు మీడియంలో ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రంపచోడవరం ఐటిడిఎ పిఒ సూరజ్ గనోరే శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆరవ తరగతి 360 (180 బాలురు మరియు 180 బాలికలు) సీట్లు, బ్యాక్ లాగ్‌లో 7వ తరగతి నుండి 9వ తరగతి వరకు ఖాళీగా ఉన్న 23 సీట్లకు అడ్మిషన్ల కొరకు ఈ దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. సీట్లకు సంబంధించి వై.రామవరం ఏకలవ్య మోడల్ స్కూల్‌లో 6వ తరగతి 30 బాలురు, 30 బాలికలు, మారేడుమిల్లిలో 6వ తరగతి 30 బాలురు, 30 బాలికలు, చింతూరులో 6వ తరగతి 30 బాలురు, 30 బాలికలు, 7వ తరగతి బాలురు 1, బాలికలు 1, రాజవొమ్మంగిలో 6వ తరగతి 30 బాలురు, 30 బాలికలు, 7వ తరగతి బాలికలు 2, 8వ తరగతి బాలురు 1, బాలికలు 3, 9వ తరగతి బాలికలు 1, రంపచోడవరంలో 6వ తరగతి బాలురు 30, బాలికలు 30, 7వ తరగతి బాలురు 1, 8వ తరగతి బాలురు 1, అడ్డతీగలలో 6వ తరగతి బాలురు 30, బాలికలు 30, 7వ తరగతి బాలురు 1, 8వ తరగతి బాలురు 8, 9వ తరగతి బాలురు 1, బాలికలు 1 సీట్లు ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గల విద్యార్థులు తమ దరఖాస్తులను ap gurukulam.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్‌లో మార్చి 31వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులకు ఏప్రిల్ 13వ తేదీన రాత పరీక్ష నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు కొరకు పైన పేర్కొన్న ఏకలవ్య లేదా గురుకుల పాఠశాలలను సంప్రదించాలని కోరారు.

జగనన్న విద్యా దీవెన నిధులు విడుదల

ప్రజాశక్తి -పాడేరు: జగనన్న విద్యా దీవెన కింద జిల్లాలో 12,457 మంది విద్యార్థుల తల్లుల ఖాతాల్లో రూ.6,15,12,533లు జమ అయ్యాయి. 2023 - 24 ఏడాది మొదటి విడత జగనన్న విద్యా దీవెన ఆర్థిక సహాయం అక్టోబర్ - డిసెంబర్, 2023 త్రైమాసికానికి విద్యార్థులకు లబ్ధి చేకూరుస్తూ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన రెడ్డి కృష్ణా జిల్లా, పామర్రులో శుక్రవారం బటన్ నొక్కారు.ఇందులో భాగంగా కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత మాట్లాడుతూ, విద్యార్థులు బాగా చదువుకోవాలన్నారు. సమస్య లను అధిగమించడానికి విద్య అవసరమన్నారు. డిగ్రీ తర్వాత సివిల్ సర్వీసెస్‌కు ఉన్న పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. విద్యతోనే అభివృద్ధి సాధ్యమని, ఇందుకు ప్రభుత్వం పథకాలు ప్రవేశ పెడుతుందన్నారు. విద్యకు పేదరికం అడ్డుకాకూడదు అన్నదే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమన్నారు. జిల్లాలో ఐటిఐ, పాలిటెక్నిక్, డిగ్రీ, ఇంజినీరింగ్, మెడిసిన్ తదితర కోర్సులు చదివే 12,457 మంది విద్యార్థులకు ఖాతాల్లో రూ.6,15,12,533 కోట్లు నగదు సంబంధిత ఖాతాలకు జమ అవుతుందన్నారు. జిల్లాలో 10,327 మంది ఎస్‌టి విద్యార్థుల ఖాతాల్లో రూ.4,76,91,215లు, 339 మంది ఎస్.సి విద్యార్థుల ఖాతాల్లో రూ.2,29,25,94, బిసి సంక్షేమ శాఖ కింద 1,319 మంది బి.సి విద్యార్థులకు రూ.82,26,499, 127 మంది ఇ.బి.సి విద్యార్థులకు రూ.11,39,425, 282 మంది కాపు విద్యార్థులకు రూ.16,78,981, మైనారిటీ సంక్షేమ శాఖ కింద పది మంది క్రిస్టియన్ మైనారిటీ విద్యార్థులకు రూ.1,00,520, 53 మంది ముస్లిం మైనారిటీ విద్యార్థులకు రూ.3,83,299లు కలిపి మొత్తం 12,457 మంది విద్యార్థులకు రూ.6,15,12,533 జమ చేశారన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలల విద్యార్థులు మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి చదువుకోవడానికి ప్రభుత్వం అందిస్తున్న వివిధ విద్యా పథకాలు దోహదపడుతున్నాయని తెలిపారు. అనంతరం జిల్లా కలెక్టర్ జగనన్న విద్యా దీవెన నమూనా చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్.టి. కమిషన్ సభ్యులు లిల్లీ సురేష్, రామలక్ష్మి, ఎంపిపి ఎస్.రత్నకుమారి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు పాల్గొన్నారు.

చెక్కును అందజేస్తున్న కలెక్టర్ విజయసునీత

బాలికపై అత్యాచారం

-ఆలస్యంగా వెలుగులోకి...
-నిందితుడిని శిక్షించాలి: ఐద్వా

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అల్లూరి జిల్లా అరకువేలి మండలంలో బాలికలపై అత్యాచారం ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. మండలంలోని చోంపి గ్రామంలో 9 ఏళ్ల బాలికపై అదే గ్రామానికి చెందిన గెమ్మెలి చరణ్ అత్యాచారం చేశాడు.ఈ సంఘటన గత నెల 28న చోటు చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే పోలీసులను ఆశ్రయించారు. కేసు నమోదు చేసి నిందితుడిని నిర్భయ చట్టం కింద కేసు నమోదు చేసి కఠినంగా కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు కోరారు.

నినాదాలు చేస్తున్న ఐద్వా నేతలు

నిందితుడిని శిక్షించాలి: ఐద్వా

బాలికపై అత్యాచారానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలని ఐద్వా రాష్ట్ర కమిటీ సభ్యులు వివి జయ డిమాండ్ చేశారు. శుక్రవారం ఈ సంఘటనపై ఐద్వా నేతలు గ్రామంలో సందర్శించి బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శించారు. అనంతరం అరకువేలి మండలం ఆదివాసీ గిరిజన సంఘం భవనం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు.తహశీల్దార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జయ మాట్లాడుతూ, బాలికపై అత్యాచారానికి పాల్పడిన గెమ్మెలి చరణ్ పై నిర్భయ చట్ట ప్రకారం కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిరుపేద కుటుంబం అయిన బాలిక తండ్రికి ఉపాధి కల్పించాలన్నారు. బాధితురాలు ఆరోగ్యవంతురాలుగా తిరిగేంతవరకు ప్రభుత్వం బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. బాధిత వికలాంగ బాలిక నడవలేని పరిస్థితి వికలాంగులు అయినటువంటి బాలికకు అన్ని విధాల ప్రభుత్వం సహాయ సహకారాలు అందించాలన్నారు.ఈ కార్యక్రమంలో గిరిజన మహిళ సంఘం జిల్లా కమిటి సభ్యులు జి సన్యాసమ్మ, చోంపి సర్పంచ్ కె సుభద్ర, ఎంపీటీసీ సోమెల జానకి,లక్ష్మి,బి సన్యాసమ్మ,పి సుశీల, సోమల మొత్తి, సిహెచ్ బుల్లమ్మ, వార్డు సభ్యులు కోగేశ్, ఆదివాసీ గిరిజన సంఘం మండల అద్యక్షుడు జి బుజ్జి బాబు,గ్రామ యువతలు పాల్గొన్నారు.

ఫిజియోథెరపిస్ట్ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-పాడేరు టౌన్: జిల్లాలోని ఆయా మండలాల్లో భవిత కేంద్రాలలో ఫిజియోథెరపీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు సమగ్ర శిక్ష జిల్లా అదనపు పథక సమన్వయకర్త (ఎసిపి) పి.బ్రహ్మాజీరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 11వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. ఇంటర్మీడియట్ తో పాటు గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం, కళాశాలలో బ్యాచ్ లర్ ఆఫ్ ఫిజియోథెరపీ డిగ్రీలో ఉత్తీర్ణత కలిగి ఉండాలని తెలిపారు. దరఖాస్తులను గడువులోపు పాడేరు పిఎంఆర్‌సిలోని సమగ్ర శిక్ష కార్యాలయంలో సమర్పించాలని పేర్కొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన రామలక్ష్మి

ప్రజాశక్తి -అనంతగిరి: అల్లూరి సీతారామరాజు జిల్లా నూతన కలెక్టర్ విజయ సునీత ను శుక్రవారం రాష్ట్ర ఎస్టీ కమిషన్ మెంబర్ కొర్రా , రామలక్ష్మి మర్యాదపూర్వకంగా కలిశారు. గిరిజన ప్రాంతంలో ఉన్న గ్రామాల్లో తాగునీటి, రోడ్ల వంటి సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేయాలని కోరారు.

5వ రోజుకు రిలే దీక్షలు

ప్రజాశక్తి -హుకుంపేట: మండల కేంద్రంలో గిరిజనేతరురాలు బుడ్డిగ కొండమ్మ చెపుతున్న అక్రమ నిర్మాణాలను ప్రభుత్వం వెంటనే తొలగించాలని చేపడుతున్న రిలే దీక్షలు శుక్రవారం 5వ రోజుకు చేరుకున్నాయి. అనంతరం అదివాసీ సేన జిల్లా కన్వీనర్ సిహెచ్ రాజుబాబు మాట్లాడుతూ,ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులకు రక్షణ కరువైందన్నారు. గిరిజనేరురాలు బుడ్డిగ కొండమ్మ ఇల్లు కూల్చి వేయాలని డిమాండ్ చేశారు. రిలే దీక్షలు చేపడుతున్నా అధికారులు స్పందింక పోవడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో విజయ్, ఆనంద్, నూకరాజు, రవి పాల్గొన్నారు.

నినాదాలు చేస్తున్న ఆదివాసీలు

పల్స్ పోలియోపై అవగాహన

ప్రజాశక్తి-డుంబ్రిగుడ: ఈనెల 3 నుంచి 5 వరకు జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతూ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నుంచి మూడు రోడ్ల జంక్షన్ వరకు శుక్రవారం వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించి మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా వైద్యాధికారి పి రాంబాబు మాట్లాడుతూ, సున్న నుంచి ఐదేళ్ల లోపు గల పిల్లలకు తప్పనిసరిగా పోలియో చుక్కలను వేయించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎం పి హెచ్ఓ సౌరి, హెల్త్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

మానవహారం చేపడుతున్న విద్యార్థులు

పంచాయతీ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి -అనంతగిరి: అనంతగిరి పంచాయ తీలోని గ్రామాల అభివృద్ధికి తన వంతు కృషి చేస్తున్నానని స్థానిక సిపిఎం సర్పంచ్ సోమ్మెల రూతు తెలిపారు. స్థానిక సచివాలయం వద్ద శుక్రవారం సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, రెండున్నర సంవత్సరాల కాలంలో పంచాయతీలో గ్రామాల అభివృద్ధికి సుమారు రూ. 20 లక్షలు వివిధ పనులకు ఖర్చు చేశామని, మరికొన్ని పనులను ప్రతిపాదనలు పెట్టామన్నారు. తాగునీటి సమస్య తలెత్తకుండా మరమ్మతు పనులకు నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఇవోపిఆర్‌డి గోపాలకృష్ణ, డిడిఓ శ్రీనివాసరెడ్డి, సెక్రటరీ శెట్టి. బాలకృష్ణ, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సర్పంచ్ రూతు

ఎన్నికల్లో విజయమే లక్ష్యంగా పని చేయాలి

- నిర్వాసితులను ఓటు అడిగే హక్కు ఆ పార్టీలకు ఉందా?
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం

ప్రజాశక్తి-విఆర్.పురం

రానున్న సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా ప్రతి కార్యకర్తా పనిచేయాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు మంతెన సీతారాం పిలుపునిచ్చారు. మండలంలోని రేకపల్లి సిపిఎం కార్యాలయంలోని పంకు సత్తిబాబు అధ్యక్షతన శుక్రవారం జరిగిన సిపిఎం మండల సమావేశంలో సీతారాం ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రజలు సిపిఎంకు మద్దతుగా ఉన్నారని, వారి ఓట్లను సిపిఎం గెలుపునకు ఆయుధంగా మల్చాలని సూచించారు. పోలవరం నిర్వాసితుల పరిహారం సమస్యపై వైసీపీ ప్రభుత్వ కప్పదాట్లు వ్యవహార శైలిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. సిపిఎం రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మాట్లాడుతూ మడమ తిప్పని ముఖ్యమంత్రి భూములకు రూ.5 లక్షలు, ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు ఇస్తామని చెప్పి మాట తప్పారని విమర్శించారు. వైసీపీ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను గ్రామ గ్రామాన ఎండగట్టాలన్నారు. టిడిపి, జనసేన, వైసిపి అభ్యర్థులు గెలిచినా పోలవరం గురించి మాట్లాడే పరిస్థితి లేదని, అదే సిపిఎం అభ్యర్థి ఎమ్మెల్యేగా గెలిస్తే పోరాడి నిర్వాసితులకు న్యాయం చేస్తారని చెప్పారు. నిర్వాసితులను ఓటు అడిగే హక్కు వైసిపి, టిడిపి, జనసేన పార్టీలకు ఉందా? అని ప్రశ్నించారు. ఈ సమావేశంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు పూనెం సత్యనారాయణ, మండల కార్యదర్శి సోయం చిన్నబాబు, నాయకులు కుంజ నాగిరెడ్డి, వడ్లది రమేష్, తోడం రాజు, పులి సంతోష్‌కుమార్, తుర్రం, బాబురావు రెడ్డి, గూటాల శ్రీనివాసరావు, కారం సుందరయ్య. సత్యనారాయణ, సీనియర్ నాయకులు సిహెచ్. సుబ్బారావు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సీతారాం, చిత్రంలో జిల్లా కార్యదర్శి కిరణ్, తదితరులు

బిజెపి, వైసిపి, టిడిపిలను ఓడించాలి

కూనవరం : గిరిజనులను, పోలవరం నిర్వాసితులను మోసం చేసిన బిజెపి, వైసిపి, తెలుగుదేశం పార్టీలను వచ్చే ఎన్నికల్లో ఓడించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు మేకల నాగేశ్వరరావు, వైస్ ఎంపీపీ కొమరం పెంటయ్య పిలుపునిచ్చారు. మండలంలోని కూటూరులో జరిగిన సీపీఎం శాఖ సభ్యుల సమావేశంలో వారు మాట్లాడుతూ కేంద్ర బిజెపి ప్రభుత్వం గిరిజన చట్టాలను నిర్వీర్యం చేస్తుంటే, వైసిపి, టిడిపిలు అందుకు మద్దతు ఇస్తున్నాయని విమర్శించారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై ఈ పార్టీలు చాలా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఈ ప్రాంత ప్రజల సమస్యలపై పోరాడేది సిపిఎం మాత్రమేనని తెలిపారు. 1/70 చట్టం, పీసా, అటవీహక్కుల చట్టం, జిఒ నెంబర్ 3 వంటి అమలు సిపిఎంతోనే సాధ్యమని చెప్పారు. ఈ సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి పాయం సీతారామయ్య, శాఖ కార్యదర్శి పాయం శేఖర్, చిచ్చడి రాజయ్య, సొడే శ్రీరాములు, నుపా రాజు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

'మన ఓటు - మన భవిష్యత్తు' పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కూనవరం : మన ఓటు -మన భవిష్యత్తు, ఓట్ ఫర్ ఓపిఎస్ నినాదాలతో యుటిఎఫ్ ముద్రించిన వాల్ పోస్టర్లను మండల విద్య వనరులు కేంద్రంలో ఆ సంఘం నాయకులు శుక్రవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా యుటిఎఫ్ మండల అధ్యక్షులు ఎ.నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి పి.కన్నారావు మాట్లాడుతూ మన భవిష్యత్తును నిర్ణయించేది మనం ఎన్నుకున్న రాజకీయ నేతలే కానీ, వారి రాజకీయ భవిష్యత్తును నిర్ణయించేది మన ఓటు మాత్రమేనని పేర్కొన్నారు. అందువల్ల పాత పెన్షన్ స్కీమ్‌ను పునరుద్ధరణ కోసం మ్యానిఫెస్టోలో పెట్టే వారికే మన ఓటు అనే నినాదాన్ని ఉద్యోగ ఉపాధ్యాయులో తీసుకుని వెళ్ళవలసి అవసరం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు యం.రాంబాబు, టి.వెంకటయ్య, కె.రజినీకుమార్, యం.నందిని, నీరు కుమారి, జి.నాగదుర్గ పాల్గొన్నారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

వెదురు ఉత్పత్తుల తయారీ శిక్షణకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి-రంపచోడవరం

వెదురు ఉత్పత్తుల తయారీపై శిక్షణ ఇచ్చేందుకు ఏజెన్సీలోని గిరిజన యువతీ యువకులు నుండి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. మంగళవారం ఆయన తన క్యాంపు కార్యాలయంలో మాట్లాడుతూ వెదురుతో ఫర్నిచర్, డెకరేషన్ వంటి వివిధ రకాల వస్తువులు తయారు మీద శిక్షణ రంపచోడవరం వైటిసిలో ఇవ్వనున్నట్లు చెప్పారు. ఈ శిక్షణ మొదటి విడతలో 30 మందికి ఇస్తామని, ఆసక్తి గల గిరిజన అభ్యర్థులు ఈ నెల 5వ తేదీ లోగా ఏడు మండలాల్లోని వెలుగు కార్యాలయాల్లో తమ వివరాలు నమోదు చేసుకోవాలని సూచించారు.

జర్నలిస్టుల ఇళ్ల స్థలాలపై అధికారులు స్పందించాలి

ప్రజాశక్తి-మారేడుమిల్లి

జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలపై ప్రభుత్వం ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని పలు జర్నలిస్టులు డిమాండ్ చేశారు. శుక్రవారం రంపచోడవరం, చింతూరు డివిజన్ల అక్రియేటడ్ జర్నలిస్టుల సమావేశం మారేడుమిల్లిలో జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తి రీత్యా ఎన్నో ఒడిదుడుకులకు లోనయ్యే జర్నలిస్టులకు ఇప్పటికీ సొంత ఇల్లు లేవన్నారు. ఏజన్సీలో పనిచేసే జర్నలిస్టులకు 1/70 చట్టం అడ్డంకుగా ఉన్న కారణంగా అర్హులైన వారికి మైదాన ప్రాంతాల్లో స్థల సేకరణ చేసే విధంగా ఉన్నతాధికారులు చొరవ చూపాలని కోరారు. ఈ కార్యక్రమంలో సుమారు 25 మంది జర్నలిస్ట్ లు పాల్గొన్నారు.

రికార్డు స్థాయిలో రేవు వేలం పాట

ప్రజాశక్తి-కూనవరం : కూనవరం, రుద్రంకోట రేవు ఫెర్రి వేలం పాట ఎన్నడూ లేని విధంగా రూ.80 లక్షలకు చేరి రికార్డు సృష్టించింది. ప్రతి ఏటా లాగే ఈ ఏడాది ఫెర్రి వేలం పాట శుక్రవారం నిర్వహించారు. గత ఏడాది రూ.35.50 లక్షలకు వేలం పాట పాడగా, ఈ ఏడాది ఏకంగా రూ.80 లక్షలకు చేరింది. ఈ వేలం పాటకు ఎక్కువగా మంది పోటీ పడగా విఆర్.పురం మండలానికి చెందిన వాళ్ల బాపూజీ ఈ పాటను సొంతం చేసుకున్నారు. ఎన్నడూ లేని విధంగా పాట పెరగడంతో వచ్చిన పాట దారులు, ప్రజలు ఒకింత ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు. ఇంత పాట పాడి ఎక్కువ ఛార్జిలు వసూలు చేస్తారా? అని, ఇంకో వైపు నిబంధనల ప్రకారం ఫెర్రి నడుపుతారా? అని అనుమానం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయితీ ఈ ఓ సురేష్, ఎండీ ఓ ప్రేంసాగర్, సర్పంచ్ హేమంత్, ఎంపీపీ పాయం రంగమ్మ, వైస్ ఎంపీపీ సాంబశివ, ఎంపీటీసీ అనంతలక్ష్మి, రెండు పంచాయతీల సిబ్బంది పాల్గొన్నారు.

భూసార పరీక్షలపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి-మారేడుమిల్లి : మారేడుమిల్లి, రంపచోడవరం ఏకలవ్య విద్యార్థులకు భూసార పరీక్షలపై శుక్రవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆత్మ ప్రాజెక్ట్ అధికారి జ్యోతిర్మయి విద్యార్థులకు భూసార పరీక్షలపై అవగాహన కల్పించారు. పందిరిమామిడి కృషి విజ్ఞాన కేంద్రం సైంటిస్ట్ క్రాంతి కుమార్ మట్టిలో ఉండే పోషకాలు మొక్కలకు, పంటలకు ఏ విధంగా ఉపయోగపడుతున్నాయో వివరించారు. మారేడుమిల్లి, రంపచోడవరం ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల ప్రిన్సిపాల్స్ టి.అరుణ కుమారి, విట్టల్ ఆధ్వర్యాన జరిగిన కార్యక్రమంలో రెండు మండలాల వ్యవసాయాధికారులు కె.వెంకటేశ్వర్లు, కె.లక్ష్మణరావు, డాక్టర్ వైఎస్ఆర్ ల్యాబ్ అధికారి సత్యదేవి, ఆత్మ ఏటీఎం, విఎఎలు ప్రసాద్, మురళి, సిద్ధార్థ, ఏఈవోలు హనుమంతరావు రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

పల్స్ పోలియో బ్యానర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-రంపచోడవరం : ఏజెన్సీలోని 0.-5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ పోలియో నిర్మూలించేందుకు పోలియో చుక్కలు వేయించాలని రంపచోడవరం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సూరజ్ గనోరే పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఐటీడీఏ సమావేశపు హాలులో ఈనెల 3 నుండి 5వ తేదీ వరకు జరుగు పోలియో చుక్కలకు సంబంధించిన బ్యానర్‌ను ప్రాజెక్ట్ అధికారి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏడు మండలాలలో 19,815 మంది పిల్లలకు పోలియో చుక్కలు వేసే లక్ష్యంతో 576 బూతులు, 72 రూట్లు, 25 మొబైల్ టీంలు ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏడీఎంహెచ్ఓ డాక్టర్ జి ప్రకాశం, వైద్యాధికారులు శిరీష, వినోద్ కుమార్, ఎంపిహెచ్ఓ పీటర్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్ఎంఎస్ ఉత్తమ ఉపాధ్యాయునిగా నాగ ప్రసాద్

ప్రజాశక్తి -అడ్డతీగల : రాష్ట్రస్థాయిలో రోల్ మోడల్ స్కూల్స్ (ఆర్ఎంఎస్) ఉత్తమ ఉపాధ్యాయునిగా అల్లూరి సీతారామరాజు జిల్లా అడ్డతీగల మండలం బడదాం ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సడేల నాగప్రసాద్ ఎంపికయ్యారు. 2001 డీఎస్సీలో ఉపాధ్యాయునిగా ఉద్యోగ ప్రస్థానం ప్రారంభించిన నాగప్రసాద్ కాంప్లెక్స్, మండల, జిల్లా స్థాయిల్లో పలు అవార్డులను అందుకున్నారు. నాగ ప్రసాద్ అవార్డు రావడంపై యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి జి.తేజోరావు హర్షం వ్యక్తం చేశారు. ఆల్ రౌండర్‌గా విశేష సేవలను అందిస్తున్న నాగ ప్రసాద్ మరిన్ని అవార్డులు అందుకోవాలని ఆకాంక్షించారు. నాగప్రసాద్‌కు ఏజెన్సీ డీఈవో మల్లేశ్వరరావు, ఎంఇఒ పి.శ్రీనివాస్, యుటిఎఫ్ నాయకులు కె.శ్రీనివాస్, కెవి రాఘవులు, మంగరాజు, ఎఫ్‌డబ్ల్యూఎస్ డైరెక్టర్ దొరబాబు, మహిళా కార్యదర్శులు రమణమ్మ, కమల రత్నం, జగదీష్, రాంబాబు అభినందనలు తెలిపారు.



ప్రశంసాపత్రాన్ని అందుకుంటున్న నాగ ప్రసాద్

'ఉక్కు' పరిరక్షణ మహా పాదయాత్రకు మద్దతు

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి -గాజువాక : విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా కార్మికులు, నిర్వాసితులు చేస్తున్న పోరాటానికి తెలుగుదేశం పార్టీ సంపూర్ణ మద్దతు ఎల్లప్పుడూ ఉంటుందని మాజీ ఎమ్మెల్యే, టిడిపి జిల్లా అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఈ నెల 3న ఉక్కు పరిరక్షణ పాదయాత్రకు సంఘీభావం ప్రకటించారు. శుక్రవారం గాజువాక పార్టీ కార్యాలయంలో సమావేశంలో మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్ నిర్వాసితుల సమస్య పరిష్కారంలో పూర్తిగా విఫలమైన వైసిపి ప్రభుత్వం, ఫ్యాక్టరీ విక్రయంలో కేంద్రానికి సిఎం జగన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తున్నారన్నారు.ప్రైవేటీకరణ ఉచ్చు నుంచి స్టీల్‌ప్లాంట్ పరిరక్షణకు టిడిపి కట్టుబడి ఉందన్నారు గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాసరావు, టిఎన్‌టియుసిప్రధాన కార్యదర్శి నమ్మి సింహాద్రి, పెద్దాడ సోమినాయుడు వియ్యపు అప్పలనాయుడు, మొల్లి చిన్నోడు, గుమ్మడి నరేంద్రకుమార్, చెరుకూరి నాగేశ్వరరావు, మొల్లి పెంటరాజు పాల్గొన్నారు.

వయోజనులకు ఉచిత ఉపకరణాలు

ప్రజాశక్తి- సీతమ్మధార : కేంద్ర ప్రభుత్వ రాష్ట్రీయ వయోజన పథకం కింద 60ఏళ్ల దాటిన వృద్ధులకు దృష్టి, వినికిడి సమస్యలకు సంబంధించిన ఉపకరణాలను ఉచితంగా అందజేస్తారని మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు తెలిపారు. ఈ మేరకు ఈనెల 3న కైలాసపురం డిఎల్‌బి గ్రౌండ్‌లో వైద్యశిబిరం నిర్వహిస్తారని, ఉత్తర నియోజకవర్గ ప్రజలు సద్వినియోగంచేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా విష్ణుకుమార్‌రాజు మాట్లాడుతూ, రుషికొండను నాశనం చేసి, ప్రజాధనంలో భవనాలను నిర్మించినసిఎం జగన్‌రెడ్డి, అక్కడకు ఎవరినీ అనుమతించకపోవడమేంటని ప్రశ్నించారు. సిఎంజగన్ నియంత పోకడకు రానున్న ఎన్నికల్లో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

సిఎం సహాయనిధి అందజేత

ప్రజాశక్తి -మధురవాడ : జివిఎంసి 8వ వార్డు బింద్రానగర్‌లో పుట్టకతో మూగ, వినికిడి సమస్యతో బాధపడుతున్న ఏడేళ్ల ఎస్.జస్విత ఆపరేషన్, ఇతర వైద్యఖర్చులకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన రూ.ఐదు లక్షల చెక్కును స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం బాధిత బాలికకు అందజేశారు. ఇప్పటికే బాలిక జస్విత వైద్యానికి తల్లిదండ్రులు చాలా ఖర్చు చేయగా, ఆపరేషన్ చేయించే ఆర్థిక స్తోమత లేకపోవడంతో ఎమ్మెల్యే ముత్తంశెట్టిని ఆశ్రయించగా, ఆయన సిఫార్స్ మేరకు సిఎం సహాయనిధి సాయం మంజూరైంది. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కును అందజేశారు.

సవాళ్లను ఎదుర్కొనే సామర్థ్యం పెరగాలి

ప్రజాశక్తి -తగరపువలస :ఎటువంటి సవాళ్లనైనా ఎదుర్కొనే సామర్థ్యాన్ని పెంచుకోవాలని యువతకు జెఎన్‌టియు విజయ నగరం వైస్ ఛాన్సలర్ ఆచార్య కె వెంకటసుబ్బయ్య పిలుపు నిచ్చారు. శుక్రవారం దాకమర్రి రఘు విద్యాసంస్థల ఆధ్వర్యాన 3వ వైర్‌లెస్, యాంటినా మైక్రోవేవ్ సింపోజియంను ప్రారంభించారు, విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ఈ తరహా అంతర్జాతీయ సదస్సులు నిర్వహించడంశుభ పరిణామమన్నారు. కంప్యూటర్ సైన్స్‌తో పాటు ఇతర శాస్త్రాలకు సమాన ప్రాధాన్యత, ప్రాముఖ్యత ఉండనే విషయాన్ని యువత తెలుసుకోవాలని సూచించారుజనరల్ చైర్ డాక్టర్ పిఎస్ఆర్ చౌదరి, అమెరికాకు చెందిన రావ్.ఎస్ కన్సల్టెన్సీ నిర్వాహకులు డాక్టర్ సుధాకరరావు, నాసా జెఎల్‌పి ల్యాబ్స్ ప్రతినిధులు డాక్టర్ నాసిర్ చాహత్, డాక్టర్ పావులోఫో కార్ది, డాక్టర్ గౌరంగి గుప్తా, డాక్టర్ సిపై డెస్మండ్ సిమ్, డాక్టర్ ఆర్ రామిరెడ్డి పాల్గొన్నారు

సమస్యల పరిష్కారానికి గ్రీవెన్స్

ప్రజాశక్తి- సీతమ్మధార : ఉత్తర నియోజకవర్గ ప్రజల సమస్యలు పరిష్కారమే లక్ష్యంగా శుక్రవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కెకె.రాజు గ్రీవెన్స్ నిర్వహించారు. కార్యాలయానికి వచ్చిన పలువురి సమస్యలను స్వయంగా విని, కొన్నింటిని అక్కడికక్కడే పరిష్కరించారు. మిగతా సమస్యలకు సంబంధించి, వినతిపత్రాలను స్వీకరించి,సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తానని హామీనిచ్చారు

విమ్స్‌లో స్ట్రోక్ యూనిట్ ప్రారంభం

● రోగులకు రూ.50 వేలు విలువచేసే ఇంజక్షన్ ఉచితం

స్ట్రోక్ యూనిట్ ప్రారంభిస్తున్న డైరెక్టర్ డాక్టర్ కె.రాంబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ :విశాఖ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (విమ్స్)లో స్ట్రోక్ యూనిట్‌ను శుక్రవారం విమ్స్ డైరెక్టర్ డాక్టర్ కె రాంబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక ఒత్తిడితో బ్రెయిన్ స్ట్రోక్ గురైన రోగులను వేగంగా కోలుకునేందుకు అత్యాధునిక సదుపాయాలు, రూ.వేల విలువచేసే ఇంజక్షన్లు, మందులతో స్ట్రోక్ యూనిట్‌ను ప్రారంభించాం అన్నారు. న్యూరాలజీ వైద్యులు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇప్పటికే న్యూరో సర్జరీ సేవలు విజయవంతంగా రోగులకు పూర్తిస్థాయిలో అందిస్తున్నామన్నారు.

రూ.50 వేల విలువచేసే ఇంజక్షన్ ఉచితం

విమ్స్ ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన స్ట్రోక్ యూనిట్లో హార్ట్ ఎటాక్, బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైన రోగులకు అత్యవసర సమయంలో అందించే రూ.50వేల విలువ చేసే టీనెక్టెప్లేస్ ఇంజక్షన్‌ఉచితంగా ఇస్తామన్నారు. స్ట్రోక్, హార్ట్ ఎటాక్ కు గురైన రోగులను మూడు, నాలుగు గంటల వ్యవధిలో తీసుకొస్తే, వారికి ఈ ఇంజక్షన్ సకాలంలో అందిస్తే తక్షణమే నయమౌతుందన్నారు. అవసరమైన రోగులు ఈ యూనిట్ సేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

అతి త్వరలో మరిన్ని విభాగాలు

విమ్స్ ఆసుపత్రిలో అతి త్వరలో అధునాతన సదుపాయాలతో గ్యాస్ట్రో ఎంటరాలజీ, ఊబకాయం, బర్న్స్‌వార్డులకు సంబంధించిన సేవలు అందుబాటులోకి తేనున్నట్లు డైరెక్టర్ రాంబాబు వెల్లడించారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లు తుదిదశకు చేరుకున్నాయన్నారు.

జాతీయ క్వాంటమ్ మిషన్‌తో దేశ సాంకేతిక ప్రగతి

● గీతం ఐపిఎ సమావేశంలో ఎన్‌పిఎల్ డైరెక్టర్ వేణుగోపాల్

వేణుగోపాల్‌ను అభినందిస్తున్న గీతం ప్రతినిధులు

ప్రజాశక్తి- మధురవాడ : గణిత భౌతిక శాస్త్రాలు, కంప్యూటర్ సైన్స్‌లోని మౌలిక అంశాల ఆధారంగా పనిచేసే క్వాంటమ్ టెక్నాలజీతో దేశ సాంకేతిక ప్రగతి భవిష్యత్తులో కొత్త పుంతలు తొక్కనుందని న్యూఢిల్లీలోని నేషనల్ ఫిజిక్స్ లేబొరేటరీ (ఎన్‌పిఎల్) డైరెక్టర్ ప్రొఫెసర్ వేణుగోపాల్ అచంట వెల్లడించారు. ఇందుకోసం భారత ప్రభుత్వం రూ.6వేల కోట్లతో నేషనల్ క్వాంటమ్ మిషన్ ఫండ్‌ను నెలకొల్పిందన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం భౌతిక శాస్త్ర విభాగం, ఐపిఎ విశాఖ శాఖ సంయుక్త ఆధ్వర్యాన యువ భౌతిక శాస్త్రవేత్తల సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ, సాంకేతిక పరిజ్ఞానం కోసం ఇతర దేశాలపై ఆధారపడ కుండా పూర్తి స్వదేశీ పరిజ్ఞానం అభివృద్ధికి క్వాంటమ్ మిషన్ దోహదపడుతుందన్నారు. కోల్‌కత్తాలోని క్వాంటమ్ ఎకో సిస్టమ్స్ అండ్ టెక్నాలజీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (క్యూఇటిసిఐ) డైరెక్టర్ ప్రొఫెసర్ అరుణ్ కె.పతి, గీతం విశ్వ ప్రొఫెసర్లు బి.ఆర్.టాటా, గురజాడ రవికుమార్. గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ప్రొఫెసర్ కెఎస్.కృష్ణ తదితరులు మాట్లాడుతూక్వాంటమ్ కంప్యూటింగ్ పరిజ్ఞానం ద్వారా వివిధ రంగాలలో ప్రయోజనాలను వివరించారు.గీతం భౌతిక శాస్త్ర విభాగాధిపతి ప్రొఫెసర్ ఎమ్.చైతన్య, సీనియర్ ప్రొఫెసర్లు డాక్టర్ కవిత, డాక్టర్ రమేష్ పాల్గొన్నారు.

126 మందికి కళ్లద్దాల పంపిణీ

ప్రజాశక్తి - ఆరిలోవ : గీతం ఆసుపత్రి, ఎన్‌టిఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 12వ వార్డు ఆరిలోవ టిఐసి పాయింట్ వద్ద నిర్వహించిన కంటివైద్యశిబిరంలో దృష్టి లోపము న్నట్లు గుర్తించిన వారికి శుక్రవారం కళ్లద్దాలను పంపిణీ చేశారు. శుక్రవారం తోటగరువు టిడిపి కార్యాలయం వద్ద ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు 126 మందికి కంటి అద్దాలు పంపిణీ చేసారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు ఒమ్మి అప్పలరాజు, బుడుమూరు గోంందు, గాడి సత్యం, ఏడువాక సన్యాసిరావు, ఒమ్మి పోలారావు, కొత్తల గోపాల్, దువ్వి తాతారావు, బాలరాజు, బసవ దేవుళ్ళు పాల్గొన్నారు.

పల్స్‌పోలియోపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి-రోలుగుంట : ఐదేళ్ల లోపు పిల్లలకు ఈనెల 3, 4, 5 తేదీల్లో పోలియో చుక్కలు వేయనున్నామని బుచ్చంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారి సునీత అన్నారు. శుక్రవారం పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిహెచ్‌సీ ఆవరణలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ,18 బూత్‌లకు 72 మంది సిబ్బందిని నియమించామన్నారు. డాక్టర్ శ్రీనివాసరాజు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ద్రవ జీవామృతం తయారీకి డ్రమ్ముల పంపిణీ

ప్రజాశక్తి-ఆనందపురం : మండలంలోని తర్లువాడలో ప్రకృతి వ్యవసాయ రైతులకు కేంద్ర ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్ ద్వారా అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకోవాలని స్థానిక సర్పంచ్ బిఆర్‌బి నాయుడు కోరారు. శుక్రవారం ప్రధానమంత్రి అనుసుచిత జాతి అభ్యుదయ యోజన కింద ఎస్‌సి లబ్ధిదారులకు దవజీవామృతం తయారీకి డ్రమ్ములను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మజ్జి వెంకటరావు, డిపిఎం మోహనరావు, ఎస్‌సి కార్పొరేషన్ ఇఒ నిర్మల, ఝాన్సీ, చక్రి, భాస్కర్ పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ'పై విస్తృత ప్రచారం

ఇంటింటా ప్రచారంలో టిడిపి నేతలు

ప్రజాశక్తి -పిఎం పాలెం : జివిఎంసి ఆరో వార్డు పిఎం పాలెంలో బాబుష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమం నిర్వహించి, సూపర్ సిక్స్ పథకాలపై విస్తృత ప్రచారం నిర్వహించారు. విశాఖ పార్లమెంట్ తెలుగు యువత ఉపాధ్యక్షులు గరే గురునాథ్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో రెడ్డి సత్యనారాయణ, పెంటకోట బబ్బెలు, కొప్పాక రామకృష్ణ, తాడేల లక్ష్మి, కసిరెడ్డి లక్ష్మి పాల్గొన్నారు

పోలింగ్ కేంద్రాల పరిశీలన

ప్రజాశక్తి -భీమునిపట్నం: జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను డిప్యూటీ కలెక్టర్ మాధురి శుక్ర వారం పరిశీలించారు. సిబిఎం, సెయింట్ ఆన్స్, పిఎస్‌ఎం, ఉన్నత పాఠశాలలు,యాత కుమ్మరిపాలెం జివిఎంసి పాఠశాల పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. విద్యుత్, తాగునీరు, ర్యాంపులు ఇతర సౌకర్యాలున్నదీ లేనిదీ పరిశీలించారు.

నేరాలు ఘోరాలు

ఫొటోగ్రాఫర్ అదృశ్యంపై ఫిర్యాదు

పోతన సాయి

ప్రజాశక్తి -మధురవాడ : ఫోటోగ్రాఫర్ అదృశ్యంపై పిఎం.పాలెం పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. సిఐ రామకృష్ణ తెలిపిన వివరాలివి. జివిఎంసి ఆరో వార్డు బక్కనపాలేనికి చెందిన పోతన సాయి వృత్తిరీత్యా ఫోటోగ్రాఫర్. అవుట్‌డోర్ ఫొటోలు తీసే క్రమంలో మూడు రోజుల క్రితం రాజమండ్రి ఫోటో షూట్‌కు వెళ్తున్నట్లు ఇంట్లో తన తల్లికి చెప్పి వెళ్లాడు. తర్వాత అతని నుంచి సమాచారం లేకపోవడం, ఫోన్ స్విచ్చాఫ్ కావడంతో సాయి తల్లి రమణమ్మ కొడుకు అదృశ్యంపై పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నటుల సిఐ తెలిపారు.

వెయ్యి లీటర్ల బెల్లం పులుపు ధ్వంసం

ప్రజాశక్తి-చీడికాడ : మండలంలోని తురువోలు గ్రామం శివారులో నాటుసారా తయారీకి సిద్ధంగా ఉంచిన సుమారు వెయ్యి లీటర్ల బెల్లం పులుపును ధ్వంసం చేశామని ఎస్ఐ ఆర్.నారాయణరావు తెలిపారు నాటు సారా తయారు చేస్తే కేసులు నమోదు చేస్తామన్నారు.

కోడి పందేల శిబిరాలపై దాడి

ప్రజాశక్తి -ఆనందపురం: మండలంలో గండిగుండం ప్రాంతంలో కోడిపందేల శిబిరాలపై శుక్రవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు నాలుగు పందెం కోళ్లు, రూ.14,250 నగదు స్వాధీనం చేసుకున్నారు.14 మందిని అదుపులోకి తీసుకుని, వారిపై సెక్షన్ 41 ప్రకారం ఎఫ్ఐఆర్ నమోదు చేశామని ఆనందపురం సిఐ టివి.తిరుపతిరావు తెలిపారు.

పద్మనాభం: మండలంలోని పాండ్రంగి పంచాయతీసామయ్యవలసలో గోస్తనీ తీరంలో మామిడితోటలో కోడిపందేలపై సిఐ సిహెచ్ శ్రీధర్ ఆధ్వర్యంలో పోలీసులు దాడులు చేశారు. నాలుగు కోళ్లు, పది బైకులు, ఏడు సెల్‌ఫోన్లు, రూ.15,640నగదు స్వాధీనం చేసుకుని, పదిమందిని అదుపులోకి తీసుకున్నారు.

ఫొటోగ్రాఫర్‌పై దాడి

ప్రజాశక్తి- పెందుర్తి : పెళ్లి వేడుకలో ఫొటోలు తీసేందుకు వచ్చిన ఫొటోగ్రాఫర్లపై దాడి ఘటనపై పెందుర్తి పోలీసులకు ఫిర్యాదు అందింది. సిఐ రామకృష్ణ చెప్పిన వివరాలివి. ఈనెల 29న జరిగిన పవన్ భరత్ వివాహంలో ఫొటోగ్రాఫర్లపై చైతన్య, అతని అనుచరులు దాడి చేశారని మురళి అనే వ్యక్తి పెందుర్తి పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ తెలిపారు.

అనధికార భవన అంతస్తుకు రంధ్రం

ప్రజాశక్తి- సీతమ్మధార : జివిఎంసి 24వ వార్డు, అరవై అడుగుల రోడ్డులో అనధికారికంగా నిర్మించిన భవనాల అదనపు అంతస్తులకు రంధ్రాలు పెట్టినట్లు మూడవ జోన్ టిపిఒ ప్రమీల తెలిపారు. 200 గజాల స్థలంలో నిర్మించిన ఈ భవనంపై పలు ఫిర్యాదులు వచ్చిన నేపథ్యంలో పరిశీలన జరిపి,అనధికార అంతస్తుకు రంధ్రంపెట్టామన్నారు.

కాగా ఇదే వార్డు పరిధిలో పదుల సంఖ్యలో అనధికారిక నిర్మాణాలపై స్థానికుల నుంచి ఫిర్యాదులు వచ్చినా జివిఎంసి పట్టణ ప్రణాళిక అధికారుల తూతూమంత్రపు చర్యలపై విమర్శలు వస్తున్నాయి. అధికార వైసిపి కార్పొరేటర్ ప్రమేయంతోనే అనధికారి నిర్మాణాలు జరుగుతున్నందునే వాటి జోలికి అధికారులు వెళ్లలేకపోతున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై జివిఎంసి కమిషనర్ దృష్టి పెట్టాలని కోరుతున్నారు.

ఆలయం కనిపించడం లేదని చెట్లు నరికివేత

ప్రజాశక్తి - ఆరిలోవ :రోడ్డు మీద ప్రయాణించే వారికి ఆలయం సరిగ్గా కనిపించడం లేదనే భావనతో హనుమంతువాక, పెదగదిలి బిఆర్‌టిఎస్ రోడ్డు మార్గంలో ఏపుగా పెరిగిన చెట్లును నరికేస్తున్నా పట్టించుకునే దిక్కులేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. హనుమంతువాక నుంచి పెదగదిలి వైపు బిఆర్‌టిఎస్ రోడ్డు, సింహగిరి కాలనీ, సర్వీసు రోడ్డుకు ఆనుకొని సాయిబాబా ఆలయం ఉంది. రహదారిన పోయే వారికి ఆలయం కనిపించడం లేదని చెట్టు నరికేస్తుండడంపై గతంలో స్థానిక సంఘాల నాయకులు జివిఎంసి అధికారులకు ఫిర్యాదు చేసారు. అయినా స్పందన లేకపోవడంతో మళ్లీ శుక్రవారం అదేపనికి పూనుకున్నారని ఆరోపిసుక్తన్నారు. దీనిపై సంబంధిత అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

3న ఐడల్ గంధర్వ ఎంపికలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 3వ తేదీ ఉదయం 10 నుంచి 6 గంటల వరకు ఐడల్ గంధర్వ ఎపి - 2024 సంగీత కార్యక్రమానికి ఎంపికలు విశాఖ డాబాగార్డెన్స్ సమీపంలోని అల్లూరి విజ్ఞాన కేంద్రంలో జరుగుతాయని ఘంటసాల స్మారక పీఠం ఉత్తరాంధ్ర వ్యవస్థాపకులు డాక్టర్ పి.శరత్ చంద్ర తెలిపారు. శుక్రవారం ఉదయం పెదవాల్తేరులోని సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గతంలో ఈటీవీలో ప్రసారమైన పాడుతా తీయగా, స్వరాభిషేకం తర్వాత అటువంటి కార్యక్రమాలు ప్రస్తుతం ఏ టీవీ ఛానల్‌లోనూ రావడంలేదని తెలిపారు. తమకు ఘంటసాల మీద ఉన్న అభిమానంతో ఘంటసాల స్మారకపీఠం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ ఎంపికలలో ఉత్తరాంధ్రలోని శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం, విశాఖపట్నం జిల్లాల నుంచి ఔత్సాహిక గాయనీ గాయకులు పాల్గొనాలని ఆయన కోరారు.

అదేవిధంగా మార్చి 4వ తేదీ సాయంత్రం అదే అల్లూరి విజ్ఞాన కేంద్రంలో ఐడల్ గంధర్వ ఎపి - 2024 లోగో ఆవిష్కరణ కార్యక్రమం ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ సినీ నటులు సుమన్, మిమిక్రీ ఆర్టిస్ట్ శివారెడ్డితో పాటు పలువురు విదేశీ వ్యాపారవేత్తలు, స్థానిక ప్రముఖులు హాజరవుతారని వెల్లడించారు. 101 ఎపిసోడ్లు పాటు నిర్వహించే ఈ కార్యక్రమంలో 40 ఎపిసోడ్లు ఉత్తరాంధ్ర ప్రాంతం నుంచి ఎంపికైన వారితో నిర్వహించాలని నిర్ణయించామని తెలిపారు. మీడియా సమావేశంలో న్యూ జెర్సీ ఘంటసాల సంగీత కళాశాల వ్యవస్థాపకులు గేదెల దాము, ఘంటసాల స్వరపోషకులు ఎమ్మెస్ రాజు తదితరులు పాల్గొన్నారు.

రుషికొండపై భవనం దేనికో చెప్పలేని ప్రభుత్వం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రుషికొండపై నిర్మించిన భవనం దేనికి వినియోగించనున్నారో చెప్పలేని పరిస్థితిలో వైసిపి ప్రభుత్వం ఉందని టిడిపి జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు ఎద్దేవా చేశారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రాన్ని అప్పులు పాలే కాదు.. నవ్వుల పాలు కూడా చేసిన ఘనత జగన్మోహన్ రెడ్డిదే అన్నారు. రూ.450 కోట్లతో నిర్మించిన కట్టడంపై గోప్యత ఎందుకున్నారు. డిఫెన్స్‌కు సంబంధించి నిర్మించే భవనాలపై మాత్రమే గోప్యత ఉంటుందని తెలిపారు. రూ.200 కోట్ల హరిత ప్రాజెక్టును కూల్చేశారని గుర్తు చేశారు. గడచిన నాలుగేళ్లుగా రుషికొండ ప్రాంతంలో నిర్బంధం కొనసాగిందని, అక్కడ జరిగే నిర్మాణం దేనికని మూడేళ్ళుగా అడుగుతున్నా నేటి వరకూ సమాధానం చెప్పలేదని అన్నారు. సిఎం క్యాంప్ ఆఫీసుకని ఓ మంత్రి అంటారని, మరో మంత్రి టూరిజం ప్రాజెక్టు అంటారని, ఇంతకీ ఏ మంత్రి మాటలు నమ్మాలని ప్రశ్నించారు.

మహా శివరాత్రి వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : పూర్ణా మార్కెట్‌లో కొలువుదీరిన శ్రీ దుర్గాలమ్మ శివరాత్రి పండగ రాట మహోత్సవం శుక్రవారం ఘనంగా జరిగింది. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హాజరై రాట వేసి శివరాత్రి ఉత్సవాలను ప్రారంభించారు. కార్యక్రమంలో 35వ వార్డు వైసిపి అధ్యక్షులు అలుపున కనకరెడ్డి, ఆది విష్ణురెడ్డి, వాసుపల్లి సుబ్రహ్మణ్యం, మల్లా వెంకట విజయ్, తదితరులు పాల్గొన్నారు.

మహాసేన రాజేష్‌కు టికెట్ కేటాయింపు దారుణం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రానున్న ఎన్నికల్లో పి.గన్నవరం అసెంబ్లీ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ టికెట్‌ను వివాదాస్పదుడైన మహాసేన రాజేష్‌కు కేటాయించడం పట్ల బ్రాహ్మణ సంఘాలు భగ్గుమన్నాయి. టిడిపి నిర్ణయానికి నిరసనగా శనివారం నగరంలోని టిడిపి కార్యాలయాన్ని బ్రాహ్మణులు ముట్టడించారు. ఈ సందర్భంగా బ్రాహ్మణ సంఘ నాయకులు విజయ్ సోమయాజులు, అయ్యలూరి నాగశాస్త్రి, శివగణేష్ శర్మ, అధికారుల అశోక్, వడ్డాది ఉదయ్ కుమార్ మాట్లాడుతూ రాజేష్ బ్రాహ్మణులపై తప్పుడు వ్యాఖ్యలు చేశారన్నారు. అతని ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని కోరారు.

భువనేశ్వరిని సత్కరించిన విల్లూరి దంపతులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : 'నిజం గెలవాలి' కార్యక్రమంలో భాగంగా ఉమ్మడి విశాఖలో పర్యటించి శుక్రవారం తిరుగు పయనమైన నారా భువనేశ్వరిని టిడిపి విశాఖ పార్లమెంట్ ఉపాధ్యక్షులు విల్లూరి డాక్టర్ చక్రవర్తి, 33వ వార్డు క్లస్టర్ ఇన్‌ఛార్జి విల్లూరి తిరుమలదేవి దంపతులు ఎయిర్‌పోర్ట్ వద్ద మర్యాదపూర్వకంగా కలిశారు. ఆమెను శాలువాతో సత్కరించి విల్లూరి చిన్నతల్లి ఛారిటబుల్ ట్రస్టు జ్ఞాపికను బహుకరించారు.

నవశకం వెబ్‌సైట్‌లో తొలగించిన

ఆదివాసీ వాల్మీకులను పునరుద్ధరించాలి

ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ కో - కన్వీనర్ మిడియం బాబూరావు

సమావేశంలో మాట్లాడుతున్న మిడియం బాబూరావు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ నవశకం వెబ్‌సైట్ నుంచి తొలగించిన పాడేరు ఆదివాసీ వాల్మీకులను తిరిగి చేర్చాలని ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ్ మంచ్ జాతీయ కో - కన్వీనర్, మాజీ ఎంపీ మిడియం బాబూరావు డిమాండ్ చేశారు. గిరిజన స్పెషల్ డిఎస్‌సి తీయాలని, జిఒ నెంబర్ 3కి వెంటనే చట్టబద్ధతకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్డినెన్సు చేయాలని కోరారు. శుక్రవారం జగదాంబ దరి సిఐటియు కార్యాలయంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కమిటీ సమావేశం రాష్ట్ర ఉపాధ్యక్షులు టి.రామకృష్ణ అధ్యక్షతన జరిగింది. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో డాక్టర్ మిడియం బాబూరావు మాట్లాడుతూ జిసిసి అటవీ ఉత్పత్తులైన పిక్క చింతపండుకు కిలో రూ.60, పసుపు కిలో రూ.200, కొండ చీపురు రూ.150, జీడి మామిడికి కిలో రూ.200 కనీస మద్దతు ధర ప్రకటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కనీస మద్దతు ధర కోసం జిసిసికి కనీసం రూ.500 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. గిరిజన గురుకులం నుండి ఆదివాసీ ఉపాధ్యాయులను గెంటి వేసే కుట్ర జరుగుతోందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల ప్రకటించిన జనరల్ డిఎస్‌సిలో 6100 పోస్టులలో ఎస్‌టిలకు అన్యాయం జరిగిందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 1/70 చట్టం ప్రకారం నడుచుకోవాలన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో 2 శాతం పర్సెంటేజ్ ఉన్న గిరిజనేతరులకు 94 శాతం పోస్టులు కేటాయించడం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమన్నారు. ఆదివాసీ ఎమ్మెల్యేలు, ఎంపీల చేతగానితనం వల్ల ఆదివాసీలకు తీవ్రమైన అన్యాయం జరుగుతోందని విమర్శించారు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.చిన్నంనాయుడు, విశాఖ జిల్లా కార్యదర్శి రమణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ తీరును ఖండించండి

ప్రజాశక్తి పాడేరు:- రాజకీయస్వలాభం కోసమే వాల్మీకి ఉప తెగలను ఏపి ప్రభుత్వ పోర్టల్ లో మళ్లీ తొలగించారని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాల్ దేవ్ విమర్శించారు. శుక్రవారం పాడేరు ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా కార్యాలయం ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు చిట్టిబాబు, నరేష్ లతో కలిసి విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో మాదిరిగా మళ్లీ ప్రభుత్వ పోర్టల్ (సచివాలయం డి.ఎ. లాగిన్) లో గిరిజన తెగ ధ్రువ పత్రాలు పొందే విషయంలో గిరిజన ఉప తెగల జాబితా నుండి వాల్మీకి తెగను తొలగించారని, 34 తెగల గిరిజన జాబితాలో ఆప్షన్ లేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వాలకు ఒక తెగను చేర్చడం లేదా తొలగించడం చేసే హక్కు లేదని తెలిపారు.జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రాజ్యాంగ ధిక్కారణకి ఒడిగట్టి తన ఇష్టానుసారంగా వాల్మీకి ఉప కులాన్ని వెబ్సైట్ నుండి తొలగించడం నేరమని, వెంటనే కారకులపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసి విచారణ చేపట్టాలని డిమాండ్ చేశారు.

చింతపల్లి:రెవెన్యూకి సంబంధించిన కుల వెబ్సైట్లోని గిరిజన తెగల జాబితాలో ఉన్న వాల్మీకి ఉపకులాన్ని ప్రభుత్వ క్యాస్ట్ వెబ్సైట్లో మళ్లీ తొలగించారని, దీనికి కారణమైన వారిపై తక్షణమే ఎస్సీ, ఎస్టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఆదివాసి గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాంగి ధనుంజయ్ డిమాండ్ చేశారు. శుక్రవారం చింతపల్లిలో స్థానిక విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గిరిజన జాబితాలో వాల్మీకి తెగ ఆప్షన్ కనబడలేదని సుమారు వారం రోజుల నుండి ఈ సమస్య ఉన్నా ప్రభుత్వం పట్టించుకోలేదని ఇదేమి అన్యాయమని ఆయన ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి సాగిన చిరంజీవి, మజ్జి రాంబాబులు పాల్గొన్నారు.

ముగిసిన ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ ఆత్మగౌరవ యాత్ర

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఉత్తరాంధ్ర ప్రజాపార్టీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉత్తరాంధ్ర ఆత్మ గౌరవ యాత్ర విశాఖలో ముగిసింది. ఫిబ్రవరి 7న శ్రీకాకుళంలో మొదలయిన ఈ యాత్ర విజయనగరం, తూర్పు గోదావరి, విశాఖపట్నం జిల్లాల్లో సుమారు 1500 వందల కిలోమీటర్ల మేర కొనసాగి విశాఖలో ముగిసింది. ఈ సందర్భంగా విశాఖలో నిర్వహించిన సభలో పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు మెట్టా రామారావు మాట్లాడుతూ 23 రోజులు పాటు సాగిన ఉత్తరాంధ్ర ఆత్మగౌరవ యాత్రలో అనేక సమస్యలను గుర్తించామన్నారు. సభలో పార్టీ రాష్ట్ర అధ్యకులు కర్రి ఆదిబాబు, ఉపాధ్యక్షులు కూన రామారావు, ప్రధాన కార్యదర్శి, ఎద్దు శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

6న ఘాట్ రోడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఇసుకకొండ శ్రీ సత్యనారాయణ స్వామి ఆలయ ఘాట్ రోడ్డును ఈ నెల 6న ప్రారంభించనున్నట్లు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు. రూ.11 కోట్లతో ఈ ఘాట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టామన్నారు. తుది దశకు చేరిన ఘాట్ రోడ్డు పనులను శుక్రవారం ఆయన పరిశీలించారు.

విఎంఆర్‌డిఎ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విఎంఆర్‌డిఎ అభివృద్ధికి తన వంతు కృషి చేస్తానని సంస్థ నూతన చైర్మన్ సనపల చంద్రమౌళి పేర్కొన్నారు. శుక్రవారం ఆయన సిరిపురంలోని విఎంఆర్‌డిఎ కార్యాలయంలో చైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ తన కష్టానికి తగిన గుర్తింపు వచ్చిందని సంతోషం వ్యక్తం చేశారు. తాను వార్డు స్థాయి నుంచి కష్టపడి వైసిపిలో ఈ స్థాయికి చేరుకున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో భీమిలి శాసనసభ్యులు ముత్తంశెట్టి శ్రీనివాసరావు, ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త కెకె.రాజు, ఎమ్మెల్సీ వరుదు కల్యాణి, విశాఖ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కొండా రాజీవ్ గాంధీ, డిప్యూటీ మేయర్ సతీష్ పాల్గొన్నారు.

సంక్షోభంలో వ్యవసాయ రంగం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : దేశంలో వ్యవసాయ రంగం తీవ్ర సంక్షోభంలో ఉందని, రైతాంగాన్ని ప్రోత్సహించాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆవైపుగా చర్యలు చేపట్టడం లేదని సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి అన్నారు. సిపిఐ విశాఖ జిల్లా సమితి సమావేశం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.శ్రీనివాసరావు అధ్యక్షతన శుక్రవారం సాయంత్రం పార్టీ జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా సత్యనారాయణమూర్తి ప్రస్తుత దేశ, రాష్ట్ర రాజకీయ పరిణామాలపై మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో పార్టీ అవలంబించాల్సిన వైఖరిని స్పష్టం చేశారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి ప్రయత్నిస్తోందని తెలిపారు. రాష్ట్ర ప్రయోజనాలను వైసిపి బిజెపికి తాకట్టు పెట్టిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో కేంద్రంలో బిజెపిని, రాష్ట్రంలో దానికి వంతపాడుతున్న వైసిపి, టిడిపి, జనసేన పక్షాలను ఓడించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, కసిరెడ్డి సత్యనారాయణ, కె.సత్యాంజనేయ పాల్గొన్నారు.

స్పందనకు 72 వినతులు

ప్రజాశక్తి -పాడేరు:సమీకృత గిరిజనాభివృద్ధి సంస్థ లో శుక్రవారం నిర్వహించిన స్పందనకు 72 వినతులు అందాయి. జిల్లా కలెక్టర్ ఎం.విజయ సునీత, జాయింట్ కలెక్టర్ భావనా వశిస్ట్, ఐటిడిఎ పి.ఓ. వి.అభిషేక్ సంయుక్తంగా వివిద మండలాల నుండి వచ్చిన అర్జీదారుల నుండి వినతులు స్వీకరించారు. తాగునీటి సమస్యలు, రహదారుల నిర్మాణాలు, అంగన్వాడీ కేంద్రాల మంజూరు, భూ సమస్యలు, అటవీ హక్కు పత్రాల మంజూరు వంటి సమస్యలపై పలువురు ఫిర్యాదులు సమర్పించారు. పెదబయలు మండలం ఇంజరి పంచాయతీ అంబీరుపాడు గ్రామానికి అంగన్వాడీ కేంద్రం మంజూరు చేయాలని గ్రామస్తులు కె.సూర నాయుడు, కె. చిన్నారావు తదితరులు వినతి పత్రం సమర్పించారు.. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ బి.పద్మావతి, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఐ.కొండలరావు, ఇఇలు డి.వి.ఆర్.రాజు, కె.వేణుగోపాల్, పంచాయతీ రాజ్ పి.ఐ.యు ఇఇ. కె.లావణ్య కుమార్, డివి.ఓ. కొండలరావు, డివిజనల్ పంచాయతీ అధికారి పి. ఎస్.కుమార్, ఐటిడిఏ పరిపాలనాధికారి ఎం. హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి జమాల్ భాషా, ఐసిడిఎస్ పిడి. సూర్యలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి

ప్రజాశక్తి - అరకులోయ రూరల్: విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ భరత్ కుమార్ నాయక్ కోరారు. భారత ప్రభుత్వ కేంద్ర యువజన వ్యవహారాల, క్రీడల మంత్రిత్వ శాఖ (విశాఖపట్నం) ఆధ్వర్యంలో బ్లాక్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2024 అరకులో శుక్రవారం నిర్వహించారు. ఈ క్రీడా పోటీలు ప్రభుత్వ డిగ్రీ కళాశాల పిడి ఎస్ అప్పారావు, పిఇటి ఎస్.నారాయణ పర్యవేక్షణలో జరిగాయి. విద్యార్థులు వాలీబాల్, కబడ్డీ పోటీలలో పాల్గొన్నారు. పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె భరత్ కుమార్ నాయక్, స్పోర్ట్స్ విభాగం ఇంచార్జ్ పి.నాగబాబు, ఎన్ఎస్ఎస్ పిఓ వై.విజయలక్ష్మిలు మెడల్స్, సర్టిఫికెట్లను అందజేశారు.ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ భరత్ కుమార్ నాయక్ మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు అన్ని రంగాల్లో రాణించాలని చెప్పారు.

విశాఖపట్నం - పలాస సేవలు పొడిగింపు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ప్రయాణికుల సౌకర్యార్థం రైల్వే అధికారులు విశాఖపట్నం-పలాస-విశాఖపట్నం ప్యాసింజర్ సేవలను సోంపేట-ఇచ్ఛాపురం మీదుగా బ్రహ్మపూర్ వరకు పొడిగించాలని నిర్ణయించారు. ఈ క్రమంలో 08532 విశాఖపట్నం - బ్రహ్మపూర్ ప్యాసింజర్ స్పెషల్ మార్చి 3 నుంచి ప్రతిరోజూ సాయంత్రం 17:45 గంటలకు విశాఖపట్నం నుండి బయలుదేరి రాత్రి 23:10 గంటలకు బ్రహ్మపూర్ చేరుకుంటుంది. రైలు నెంబరు 08531 బ్రహ్మపూర్ - విశాఖపట్నం ప్యాసింజర్ స్పెషల్ మార్చి 4 నుంచి ప్రతిరోజూ ఉదయం 03:50 గంటలకు బ్రహ్మపూర్ నుంచి బయలుదేరి ఉదయం 09.20 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుంది.

ఎయు తెలుగు విభాగంలో బహుముఖ పోటీలు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఆంధ్ర విశ్వకళాపరిషత్, డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా అధ్యయన కేంద్రం ఆధ్వర్యంలో మార్చి 8న జరిగే అంతర్జాతీయ మహిళా దినోత్సవంలో భాగంగా తెలుగు విభాగ సమావేశ మందిరంలో మహిళా సాధికారత - ఆవశ్యకత అనే అంశంపై శుక్రవారం వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. తెలుగు శాఖాధిపతి ఆచార్య జర్రా అప్పారావు, ఆర్ట్స్ అండ్ కామర్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు హాజరై విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు.